సాక్షి పెద్దపల్లి

శనివారం। 24। ఆగస్టు। 2024



క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు చేయాలి

గోదావరిఖని: ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాత్‌ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవించారు.



క్యాంప్ ఆఫీసులో పూజలు

గోదావరిఖని: ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ శ్రావణ శుక్రవారం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అప్పడప్పుడు ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఖిల్లాలో పర్యటన



ఖిల్లాపై ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ ప్రభాకర్

రామగిరి(మంథని): ప్రసిద్ధ రామగిరి ఖిల్లాపై కాళేశ్వరం జోన్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ బి.ప్రభాకర్ శుక్రవారం పర్యటించారు. ఖిల్లాపై గల అటవీ విస్తీర్ణంపై ఆరా తీశారు. అడవుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. కట్టడాలు, ఇతర వనరులను ఆయన పరిశీలించారు. ఖిల్లా విశిష్టత, ఔషధ మొక్కల గురించి ఆరా తీశారు. జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, పెద్దపల్లి ఎఫ్‌ఆర్‌వో నాగయ్య, బీట్ ఆఫీసర్లు రంజిత, మాధురి, తిరుపతి, వరప్రసాద్, పవన్, ప్రదీప్, శ్రీకాంత్ ఆయన వెంట ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి



భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థులకు తాజా కూరగాయలతో కూడిన పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఎం శారద తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

రామగిరి(మంథని): కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పీఎం కుసుమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ సూచించారు. రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ ఉర్జ సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ ద్వారా రైతులు తమ పొలాల్లోనే సోలార్ పంపులు ఏర్పాటు చేసుకుని మంచి లాభాలు సాధించవచ్చన్నారు. ఇలా అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ప్రభుత్వానికి నేరుగా విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. మంథని జేఎన్టీయూ ప్రిన్సిపాల్‌తో పాటు పీఎం కుసుమ్ స్టేట్ కో ఆర్డినేటర్ భానుశ్యామ్, ట్రాన్స్‌కో ఏఈ మహేందర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు వెంకన్న, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మత్తు తినిపిస్తున్నారు..

- చాక్లెట్ల రూపంలో గంజాయి
- ద్రవ రూపంలో హాష్‌ఆయిల్
- జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు
- వేళ్లూనుకుంటున్న మాఫియా
- మత్తులో చిత్తవుతున్న యువత, విద్యార్థులు





స్వాధీనం చేసుకున్న హాష్ ఆయిల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న చాక్లెట్లు

గోదావరిఖని: ఆకులు, పొడిరూపంలో లభించే గంజాయి ఇప్పుడు ద్రవ, ఘనరూపంలోకి మారుతోంది. వినియోగం, విక్రయాలు జోరందుకోవడంతో పోలీసులు అప్రమత్తమై అడ్డుకట్ట వేస్తున్నారు. దీంతో ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని మరిగించి ద్రవ(హాష్ ఆయిల్) రూపంలోకి మార్చి విక్రయిస్తున్నారు. దీనిని కూడా పసిగట్టి పోలీసులు అక్రమార్కులపై ఉక్కుపాదం మోపారు. అయినా, వారి కళ్లు గప్పి స్మగ్లర్ల ముఠాలు మరో ముందడుగు వేశాయి. గంజాయిని ఘన(చాక్లెట్ల)పదార్థం రూపంలోకి మార్చి మార్కెట్ చేస్తున్నారు. ఇటీవల పెద్దపల్లిలో ఓ వ్యక్తి నుంచి రూ.5,800 విలువైన 280 గంజాయి చాక్లెట్లు పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేయడంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. గతంలో కూడా ఇలాంటి చాక్లెట్లు అక్కడక్కడా ఒకట్రెండు మాత్రమే పట్టుబడ్డాయి. ఇప్పుడు ఏకంగా 280 చాక్లెట్లు లభించడం పోలీసులకు సవాల్ విసిరినట్లయ్యింది.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

గంజాయి ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. నిఘా పెంచిన పోలీసులు ఈఏడాది రూ.5.36లక్షల విలువైన సుమారు 21.83 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 74 మందిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జిల్లాలో చాకెట్లు, హాష్‌ఆయిల్, ఆకు, పౌడర్ రూపాల్లో స్మగ్లర్లు విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకులోయ నుంచి రైల్వే మార్గం ద్వారా గంజాయి అత్యధికంగా జిల్లాకు చేరుతోందని పోలీసులు చెబుతున్నారు. గతేడాది బస్సుల ద్వారా తరలిస్తుండగా పోలీసులు పట్టుకోవడంతో అక్రమ వ్యాపారులు మార్గం మార్చారు. సీలేరు నుంచి సరిహద్దులు దాటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఇక్కడకు చేరుకుంటోంది. మహారాష్ట్ర నుంచి కూడా రైళ్ల ద్వారా మంచిర్యాల నుంచి పెద్దపల్లి, గోదావరిఖని తదితర ప్రాంతాలకు చేరుకుంటోంది.

లీటరు హాష్‌ఆయిల్ ఖరీదు రూ.10లక్షలు..

పది కేజీల గంజాయితో సమానమైన లీటరు హాష్ ఆయిల్ ఖరీదు రూ.10లక్షలకుపైగా ఖరీదు చేస్తోందని పోలీసులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం రెండు లీటర్ల హాష్ ఆయిల్ విక్రయిస్తూ కొందరు స్మగ్లర్లు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. అప్పటికే ఈ ముఠా రామగుండం ప్రాంతంలో సగానికిపైగా విక్రయించినట్లు గుర్తించారు. వైజాగ్ నుంచి జిల్లాలోని పొత్కపల్లి, కొలనూరు, ఓదెల, పెద్దపల్లి, రామగుండం ప్రాంతాలకు రైలు సౌకర్యం ఉంది. దీంతో అక్రమ వ్యాపారులు హాష్ ఆయిల్‌ను సులువుగా రవాణా చేస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.

గుడుంబా తరహాలో తయారీ..

గంజాయిని ఉడకబెట్టి హాష్ ఆయిల్ తయారు చేస్తున్నారు. దానిని చిన్నబాటిళ్లలో నింపి అత్యధిక ధరకు విక్రయిస్తున్నారు. తద్వారా పోలీసులకు దీనిపై అనుమానం రావడం లేదు. సుమారు 50 మి.మీ. బాటిల్ ధర ప్రస్తుతం రూ. 2వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

మరిగించి తయారీ

- గంజాయిని మరిగించి తయారు చేసేదే హాష్ ఆయిల్. జిల్లాలో దీని విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తక్కువ మొత్తంతో ఎక్కువ మత్తు ఉంటుంది. అందుకే యువత దీనిపై ఆసక్తి పెంచుకుంటోందని పోలీసు అధికారులు వివరిస్తున్నారు.

సిగరెట్లలో నింపి..

- గంజాయి ఆకును పౌడర్ చేసి సిగరెట్లలో నింపి తాగిస్తున్నారు. తక్కువ డబ్బుతో ఎక్కువ మత్తు రావడంతో యువత, విద్యార్థులు దీనికి బానిసగా మారుతోంది.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్ట్ చేసిన నిందితులు

ఏడాది	గంజాయి కేజీల్లో	విలువ రూ.లక్షల్లో	నిందితులు
2018	57.89	3.76	17
2019	216.40	26.53	24
2020	32.90	6.89	22
2021	34.48	3.70	14
2022	8.52	1.22	58
2023	34.78	7.76	58
2024	21.83	5.36	74

ఎవరినీ వదిలేదిలేదు



గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల క్రయ, విక్రయాలపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. వీటిపై ఇప్పటికే నిఘా తీవ్రతరం చేశాం. గంజాయి, డ్రగ్స్ విషయంలో ప్రభుత్వం కూడా సీరియస్‌గా ఉంది. వీటి విక్రయాలు, సరఫరా చేసే వారి విషయంలో ఎవరినీ వదిలి పెట్టేదిలేదు.

– శ్రీనివాస్, పోలీస్ కమిషనర్, రామగుండం

చైతన్యంతోనే నియంత్రణ..

యువత, విద్యార్థుల జీవితాలు ఛిద్రం చేస్తున్న గంజాయి, మాదక ద్రవ్యాలపై యువతలో చైతన్యం వస్తేనే సత్ఫలితాలు వస్తాయని నిపుణులు అంటున్నారు. ప్రధానంగా కాలేజీ స్థాయి నుంచి డ్రగ్స్ ప్రభావంపై వివరించడంతోపాటు వాటి జోలికి వెళ్లవద్దని పోలీసుశాఖ ఇప్పటికే కౌన్సెలింగ్ చేస్తోంది. కాలేజీలు, నిర్మానుష్య ప్రాంతాలు, పట్టణ, నగర శివారుల్లోని అడ్డాలపైనా పోలీసులు తనిఖీలు చేస్తే కొంత మార్పు వస్తుందని అంటున్నారు.

రక్షణతో కూడిన విధులు నిర్వహించాలి



గని మ్యాప్ పరిశీలిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: పని ప్రదేశాల్లో రక్షణతో కూడిన విధులు నిర్వహించాలని జీఎం లలిత్‌కుమార్ ఆదేశించారు. సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–2, 2ఏ గనిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గనిలోని పనిస్థలాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. గనిలోని పని స్థలాల్లో జరుగుతున్న రక్షణ ఏర్పాట్ల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రణాళికల గురించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. బొగ్గు రవాణా త్వరితగతిన జరిగేలా చూడాలని సిబ్బందికిఇ సూచించారు. కార్యక్రమంలో ఏజెంట్ చంద్రశేఖర్, డీజీఎం రామస్వామి, మేనేజర్ తిరుపతి, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై సంతకాల సేకరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 సైటాఫీస్‌లో శుక్రవారం సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కలిసి సింగరేణి యాజమాన్యంతో చర్చించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారంగం, వినేష్, కుంట ప్రవీణ్ కుమార్, ఉల్లి మొగిలి, వెంకన్న, సంపత్, రాంప్రసాద్, భూమయ్య, వెంకట నర్సయ్య, లక్ష్మీరాజం, సాంబయ్య పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగుండం కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన గ్రౌండ్ చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రామగుండం కార్పొరేషన్ అభివృద్ధిపై అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) కూడా నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తిచేసిన రోడ్లు, మురుగునీటి కాలువలు, లైటింగ్ తదితర పనులను త్వరితగతిన గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో గ్రౌండ్ చేసి వాటిని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శివానంద్, ఈఈ రామణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ నోటిఫికేషన్‌కు ఏర్పాట్లు

ఎన్టీపీసీలోని తెలంగాణ పవర్ ప్లాంట్ స్టేజీ– 2 యాష్ డైక్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నోటిఫికేషన్ పకడ్బందీగా విడుదల చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్టీపీసీ భూసేకరణ సమావేశాన్ని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్‌తో కలిసి శుక్రవారం నిర్వహించారు. అంతర్గాం మండలం మొగల్‌పహాడ్ గ్రామంలో తెలంగాణ పవర్ ప్లాంట్ స్టేజీ– 2 యాష్ డైక్ నిర్మాణానికి అవసరమైన 600 ఎకరాల సేకరణకు భూ సేకరణ చట్టం– 2013 ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు. ఎన్టీపీసీ ద్వారా టోపోగ్రాఫికల్, జియో టెక్నికల్ సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో బి.గంగయ్య, సహాయ సంచాలకుడు సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. జిల్లా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైరల్ జ్వరాల కేసులు అధికంగా వస్తున్నాయని వైద్యాధికారులు వివరించారు. అత్యధికంగా కేసులు వచ్చే ప్రాంతాలపై నివేదిక రూపొందించి తనకు సమర్పించాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. అవసరమైతే పడకల సంఖ్య పెంచేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయుష్ కేంద్రం పనులు పరిశీలించారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్ ఉన్నారు.

‘గుర్తింపు సంఘంగా గెలిచాకే గూండాయిజం’



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్, కృష్ణ, నరేశ్

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ గెలిచిన తర్వాతే గూండాయిజం, రౌడీయిజం పెరిగిపోతోందని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు రియాజ్‌అహ్మద్, ఐ.కృష్ణ, పోచమల్లు, జైపాల్‌సింగ్, ఇ.రాజేందర్ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి క్వార్టర్లు కూల్చివేస్తుంటే గుర్తింపు యూనియన్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా కార్మికురాలు స్వప్నపై జరిగిన దాడిని కార్మికులు, ప్రజలు ఖండించాలని కోరారు. దాడికి పాల్పడ్డ మడ్డి ఎల్లయ్యగౌడ్, అతడి అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కార్మిక వర్గ పక్షాన నిలవాల్సిన ఏఐటీయూసీ నాయకులు మహిళా కార్మికురాలు అని కూడా చూడకుండా అసభ్య పదజాలంత దూషిస్తూ, భౌతిక దాడి చేయడం తీవ్రమైన తప్పిదమన్నారు. కార్మిక సంఘాలు సిగ్గుపడేలా ఈ సంఘటన జరిగిందన్నారు. దీనిపై ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న వాసిరెడ్డి సీతారామయ్య నోరు విప్పకపోవడంలో అంతర్యం ఏమిటని, కార్మికురాలిపై దాడిచేసిన మడ్డి ఎల్లయ్యపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దాడికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రోజురోజుకూ మహిళా కార్మికులపై పెరుగుతున్న వేధింపులు, దాడులు అరికట్టేలా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ సమావేశంలో నాయకులు దావు రమేశ్, రామచందర్, డి.మల్లేశ్, స్వామి, నరేశ్, ఎట్ల రవికుమార్, రాయమల్లు, శేఖర్, రాయపోశం తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ డైరెక్టర్‌గా అనిల్‌కుమార్



అనిల్‌కుమార్ జాడ్లి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ డైరెక్టర్(హెచ్ఆర్)గా అనిల్ కుమార్ జాడ్లి న్యూఢిల్లీలోని కార్పొరేట్ సెంటర్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జాడ్లి 1993లో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ ట్రైనీగా నియమితులయ్యారు. అంచెలంచెలుగా మానవ వనరుల విభాగం డైరెక్టర్‌గా ఉన్నత స్థాయికి చేరడం ఆయన అభిరుచి, నిబద్ధత, కృషికి లభించిన గౌరవమని ఉద్యోగులు, అధికారులు అభినందించారు. ఆయన గుర్‌గావ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్గానిక్ కెమిస్ట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేట్, మానవ వనరుల నిర్వహణలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా పూర్తిచేశారు. సంస్థలో మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలు అందిస్తున్నారు. 2004లో హెచ్ఆర్ విభాగానికి మారారు. అనంతరం వివిధ ప్రాజెక్టుల్లో పలు హోదాల్లో విధులు నిర్వహించారు. 2020లో కార్పొరేట్ హెచ్ఆర్‌కు బదిలీ అయ్యారు. ఇటీవల ఆయనను డైరెక్టర్(హెచ్ఆర్)గా నియమించి కేబినెట్ సబ్ కమిటీకి సిఫారసు చేయగా సబ్ కమిటీ ఆమోదం మేరకు ఆయన డైరెక్టర్(హెచ్ఆర్)గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీపీసీ రామగుండంలో సైతం ఆయన హెచ్ఆర్ విభాగం అధికారిగా సేవలు అందించారు.





కఠోర సాధన

గోదావరిఖని: అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సింగరేణి రెస్క్యూ జట్టు కఠోరసాధన చేస్తోంది. యైటింక్లయిన్ కాలనీ మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో శిక్షణ కొనసాగుతోంది. జీఎం శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ మాధవరావు నేతృత్వంలో సభ్యులకు త ర్ఫీదు ఇస్తున్నారు. వచ్చేనెల 15 నుంచి 17వ తేదీ వరకు కొలంబియాలో అంతర్జాతీయ మైన్స్ రెస్క్యూ పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో ఫైర్ ఫైటింగ్, రోప్ రెస్క్యూ, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ, రికవరీ విభాగాల్లో పోటీలు ఉంటాయి. మొత్తం 25 దేశాల జట్లు హాజరవుతాయి. మనదేశం నుంచి డబ్ల్యూసీఎల్, హిందూస్థాన్ జింక్ లిమిటెడ్, సింగరేణి జట్లు ఉన్నాయి. పోటీల్లో సింగరేణి పాల్గొనడం ఇది ఆరోసారి.

సమస్యల్లో సర్కారు ఆస్పత్రి



జీజీహెచ్ మార్చురీలో శవాలను భద్రపర్చడం, పోస్టుమార్టం చేయడం కోసం బాడీ ఫ్రీజర్లను పెట్టడం సమస్యగా మారింది. దీంతో మార్చురీకి కేటాయించిన ఐదింటిలో రెండింటిని సిమ్స్‌లోని అనాటమీ విభాగానికి తరలించారు. మిగిలిన వాటిలో ఒక ఫ్రీజర్‌బాక్స్ పనిచేయడం లేదు. పర్యవేక్షణ లేక మార్చురీ కంపుకొడుతోంది.



ఇది బ్లడ్ సెంటర్‌లోని ఓ గది. రూ.20లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ర్యాండమ్ ప్లేట్‌లెట్ మిషన్, ప్లాస్మాను సపరేట్‌చేసే యంత్రంతోపాటు ఎన్టీపీసీ యాజమాన్యం రూ.25లక్షలు వెచ్చించి సమకూర్చిన సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్లు ఇవి. వీటిని వినియోగించడం లేదు. తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మైనస్ 80డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో ఉండే ఫ్రిజ్ కూడా అలంకార ప్రాయంగా మారింది.



ఇది గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) మెయిన్ గేట్. చిరుజల్లులకే ఇక్కడి రోడ్డు ఇలా బురదగా మారి నడవడానికి కూడా నరకం చూపిస్తోంది. ఆస్పత్రిలోని కొందరు వైద్య సిబ్బంది చేతివాటం కూడా ఇలాగే బురదలాగా కంపుకొడుతోంది. మగపిల్లాడు పుడితే ఒకరేటు, బాత్‌క్లీన్ చేసి, బట్టలు మార్చితే మరో రేటు కట్టి వసూలు చేస్తున్నారు. చివరకు పోస్టుమార్టం చేసినా వదలకుండా డబ్బు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలున్నాయి.

- ఎట్టకేలకు భేటీ కానున్న అభివృద్ధి కమిటీ
- 16 అంశాల ఎజెండాపై చర్చించే అవకాశం
- పేదలకు నాణ్యమైన వైద్యసేవలపై ఆశలు



అత్యవసర వైద్యసేవల కోసం పేషెంట్లను తరలించడానికి ఉపయోగించాల్సిన అంబులెన్స్‌లు నిర్వహణ లోపంతో ఇలా చెట్లపొదల్లో మూలనపడ్డాయి. మొత్తం నాలుగింటిలో రెండు నిరుపయోగమయ్యాయి. మిగతా రెండింటి టైర్లు అరిగిపోయాయి. తలుపు ఊడిపోయాయి. ఇందులో ఒకదానిని ఆక్సిజన్ సిలిండర్ల తరలింపు కోసం, ఇంకోదానిని 85 పడకల కొత్త బ్లాక్ నుంచి పాత భవనంలోకి పేషెంట్లను తరలించడానికి ఉపయోగిస్తున్నారు. అందుబాటులో అంబులెన్స్‌లు లేక పేషెంట్లు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

కోల్‌సిటీ(రామగుండం): పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాల్సిన గోదావరిఖని ధర్మాస్పత్రి(జీజీహెచ్)లో సమస్యలు తాండవవిస్తున్నాయి. సింగరేణి మెడికల్ కాలేజీ(సిమ్స్)కు అనుబంధంగా ఇది బోధనాస్పత్రిగా మారిన రెండేళ్ల తర్వాత.. అంటే శనివారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ భేటీ కాబోతోంది. అయితే, ఆస్పత్రిలో సీసీ కెమెరాలు, ఏసీలు పని చేయడంలేదు. తాగునీటి ఇబ్బందులు, గాడితప్పిన శానిటేషన్, పేషెంట్ల నుంచి డబ్బు వసూలు, తరచూ విద్యుత్ సమస్యలు, సరిపోని పేషెంట్ కేర్ సేవలు తదితర సమస్యలపై కమిటీ స్పందిస్తుందని నగరవాసులు ఆశిస్తున్నారు.

20 మందితో అభివృద్ధి కమిటీ

జీజీహెచ్‌లో 20 మందితో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ(హెచ్‌డీఎస్‌సీ) ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా కలెక్టర్ కోయ శ్రీహర్ష, వైస్ చైర్మన్‌గా సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, కన్వీనర్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్ టీపీ దయాల్‌సింగ్, సభ్యులుగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, సీనియర్ డాక్టర్ అశోక్, ఆర్ఎంవో రేణుక, సీనియర్ ప్రొఫెసర్లు అరుణ, వేణుమాధవ్, నరేందర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, ఇంజినీర్ రవీందర్, ఐఎంఏ అధ్యక్షుడు దామెర అనిల్‌కుమార్, లయన్స్ క్లబ్ ప్రతినిధి రాజేందర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లతామోహన్, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, డీసీహెచ్ఎస్ శ్రీధర్ ఉన్నారు.

16 అంశాల ఎజెండాపై కమిటీ చర్చ

జీజీహెచ్‌లో ఉదయం 10.30 గంటలకు భేటీ కానున్న అభివృద్ధి కమిటీ.. 16 అంశాలతో రూపొందించిన ఎజెండాపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది. ఆస్పత్రి భవనం పునరుద్ధరణకు రూ.1.50 కోట్లు, ఆర్‌వో ప్లాంట్, 12 ఏసీలు, ప్రతీ వార్డుకు ఒకటి చొప్పున 21 ఫ్రిజ్‌లు, పేషెంట్ల అటెండర్లకు షెడ్లు, క్యాంటీన్, బయోమెడికల్ వేస్టేజ్, సీసీ కెమెరాలు, డీవీఆర్, ప్రతీ వార్డుకు అగ్నిమాపక యంత్రం, ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక రోడ్లు, రెండేళ్లుగా చేసిన ఖర్చులకు అనుమతి తదితర 16 అంశాలపై చర్చించనున్నారని ఆస్పత్రి అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

రుద్రంగి మాజీ ఎంపీపీ భర్తపై కేసు

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మాజీ ఎంపీపీ గంగం స్వరూపారాణి భర్త, బీఆర్ఎస్ నాయకుడు మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గురువారం రుద్రంగి రాజకీయాలు అనే వాట్సాప్ గ్రూపులో మహేశ్ కాంగ్రెస్ నాయకులను అసభ్య పదజాలంతో దూషిస్తూ, పార్టీని, ప్రభుత్వాన్ని కించపరిచేలా వాయిస్ మెస్సేజ్‌లు పెట్టాడని కాంగ్రెస్ రుద్రంగి గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మహేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఇతరులనుద్దేశించి అవమానపరిచేలా, గొడవలకు దారితీసేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా మెస్సేజ్‌లు పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘అల్ఫోర్స్’లో ఘనంగా గోకుల్ ఉత్సవ్



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్, అల్ఫోర్స్ టైనీటాట్స్, భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని శుక్రవారం గోకుల్ ఉత్సవ్ పేరిట ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల్లో భక్తిభావం పెంపొందించడానికి, చారిత్రక శ్రీకృష్ణుని చరిత్ర తెలియజేయడానికి వేడుకలు జరిపినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెదలాలని, భగవద్గీత పఠించాలని సూచించారు. సుమారు 350 మంది విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి, నృత్యాలతో సందడి చేశారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని ఆరెపల్లికి చెందిన గడ్డి కొమురయ్య ఆత్మహత్యాయత్నం చేశాడని గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కొమురయ్య ఇంట్లో కొన్నేళ్లుగా కుటుంబ కలహాలున్నాయి. మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కలవారు వెంటనే వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఆలయంలో చోరీ

రామగుండం: అంతర్గాం మండలం రాయదండి శివారులోని శ్రీచిలుకల రామేశ్వరాలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ తోకల కుమార్ తెలిపారు. అమ్మవారి ముక్కు పుడక, నాలుగు జతల మంగళ సూత్రాలు, వెండి మెట్టెలను దొంగలు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- వైద్యుడిపై దాడి కేసులో ప్రధాన నిందితులు కూడా..
- వివరాలు వెల్లడించిన ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్‌రూరల్/ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండలంలోని కొలనూర్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. శుక్రవారం సుల్తానాబాద్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన రౌడీషీటర్(ప్రస్తుతం కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న) పులిపాక శ్రీకాంత్ కొన్నిరోజుల క్రితం కొలనూర్‌లోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. గత బుధవారం రాత్రి 10 గంటల సమయంలో ఇతనితోపాటు అదే గ్రామానికి చెందిన మాజీ హోంగార్డు మాటూరి విజయ్(40) వేర్వేరుగా స్థానిక బెల్ట్‌షాప్ వద్దకు వచ్చారు. అక్కడ మూత్రశాలలు సరిగా లేవని విజయ్ అనడంతో అతనికి, శ్రీకాంత్‌కు మధ్య మాటామాట పెరిగింది. ఇద్దరూ కొట్టుకున్నారు. శ్రీకాంత్ తన వద్ద ఉన్న కత్తితో విజయ్‌ని పొట్టలో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ గతంలో మంథని సుమన్ అనే రౌడీషీటర్‌తో తిరిగి, ఓ హత్య కేసులో జైలుకు వెళ్లి వచ్చాడని ఏసీపీ తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్‌లో అతనిపై మూడు కేసులున్నట్లు పేర్కొన్నారు. మృతుడు విజయ్‌పైనా రెండు కేసులున్నాయని అన్నారు. మృతుడి భార్య స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశామని, సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కృష్ణ, పక్కన సీఐ, ఎస్సైలు

వైద్యుడిపై దాడి కేసులో మరో ఇద్దరు..

కాల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీ వైద్యుడు పెద్దపల్లి మండలంలోని నిట్టూరుకు చెందిన బుసనవేణి మహేందర్‌పై గత నెల 30న దాడి చేసిన కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ కృష్ణ తెలిపారు. సంబంధిత వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పందిల్లకు చెందిన ఏఎన్ఎం కాసిపాక విజయ డ్యూటీకి రాకుండా విధులను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో వైద్యుడు మహేందర్ విధులకు హాజరవకుంటే ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానని ఆమెను మందలించారు. ఇది మనసులో పెట్టుకున్న విజయ ఈ విషయాన్ని తనకు పరిచయం ఉన్న అన్నం కృష్ణకు, అతని స్నేహితులకు చెప్పింది. అందరూ కలిసి పథకం ప్రకారం గత నెల 30న వైద్యుడు డ్యూటీ ముగించుకొని, తన స్నేహితుడు కడమళ్ల ప్రకాశ్‌రావు, ఎనగందుల మహేశ్‌లతో కలిసి కారులో ఇంటికి వెళ్తుండగా బూర్గుపల్లి(మంగపేట) వద్ద రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో వైద్యుడు మహేందర్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన అన్న శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5న ఎ–3, 4, 5, 6, 7, 8 బాలాజీ, కోర్లల రఘువర్ధన్‌రెడ్డి, మామిడాల లవణ్‌కుమార్, హిమాయత్, దారంగుల సాగర్, బొక్కల ఆదిత్యలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు కాసిపాక విజయ, అన్నం కృష్ణ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కారులో శ్రీశైలం, హైదరాబాద్, యాదగిరిగుట్ట, విజయవాడ తిరుగుతూ గురువారం మంచిర్యాల నుంచి పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్ మీదుగా వరంగల్ వెళ్తున్న ఆ ఇద్దరినీ పక్కా సమాచారంతో సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రీధర్‌లు గంగారం వద్ద అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ తెలిపారు. రెండు కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ సుబ్బారెడ్డి, ఎస్సైలు అశోక్, శ్రీధర్, శ్రవణ్‌కుమార్, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

ఒకరు చొరబడి.. మరొకరు కాపలా ఉండి

- పెద్దపల్లి జిల్లా రచ్చపల్లిలో దొంగల తీరు
- యజమానులు రావడంతో పరారైన ముష్కరుడు
- ఇంట్లో మూలకు నక్కిన మరో వ్యక్తి
- ఆ తర్వాత దొంగ తనకు తెలుసని, పట్టిస్తానని చెప్పిన వైనం
- పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

ధర్మారం(ధర్మపురి): ఓ దొంగ దర్జాగా బీరు తాగుతూ ఇంటి ఎదుట కాపలా కాస్తున్నాడు.. మరో దొంగ ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు.. ఇదే సమయంలో ఇంటి యజమానులు రావడంతో కాపాలా ఉన్న దొంగ పారిపోగా.. ఇంట్లో ఉన్న వ్యక్తి మూలన నక్కి ఆ తర్వాత గ్రామస్తులకు చిక్కాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. రచ్చపల్లికి చెందిన వెముర్ల లింగయ్య–నర్సమ్మ దంపతులు. వీరికి కుమారుడు అంజయ్య, కోడలు కావ్యశ్రీ ఉన్నారు. వీరంతా శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి, పొలం పనులకు వెళ్లారు. వర్షం కురవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. అయితే, ఇంటి ఎదుట వేపచెట్టు వద్ద ఓ యువకుడు మోటార్ సైకిల్‌పై కూర్చొని, బీరు తాగుతున్నాడు. తమ ఇంటి ఎదుట బీరు తాగొద్దని అంజయ్య సూచించాడు. అయితే, తాను ధర్మారం వెళ్తూ ఇక్కడ ఆగానని అతను చెప్పడంతో అనుమానం వచ్చిన అంజయ్య.. విషయం సమీపంలోని తన బాబాయికి చెబుతూ ఇంట్లోకి వెళ్లాడు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఈలోగా బైక్‌పై ఉన్న యువకుడు అక్కడి నుంచి పారిపోయాడు. అంజయ్య వెంటనే ఇంటి తలుపులు మూసి గడియ పెట్టాడు. పారిపోయింది దొంగ అని నిర్ధారించుకొని గ్రామస్తులతో వెతికేందుకు విఫలయత్నం చేశాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చి గడియ తీసి లోనికి వెళ్లాడు. అయితే, బీరువాలోని బట్టలు చిందరవందరగా పడేసి ఉండటం, అరతులం బంగారు ఉంగరం కనిపించకపోవడంతో చోరీ జరిగిందని భావించాడు. ఈలోగా గ్రామస్తులు, బంధువులు అక్కడకు చేరుకున్నారు. చోరీ విషయంపై ఆరా తీస్తుండగానే.. అప్పటికే ఇంట్లో నక్కిన దొంగ.. బీరువా వెనకాల నుంచి బయటకు వచ్చాడు. తాను దొంగను చూశానని, అతడిని పట్టిస్తానని గ్రామస్తులతోపాటు అంజయ్యతో నమ్మబలికాడు. అసలు నువ్వెవరని వారు ప్రశ్నించగా.. మోటార్ సైకిల్‌పై పారిపోయిన వాడు తన మిత్రుడు రాజు అని, అతడు ఇంటి తాళం పగులకొట్టి చోరీకి ప్రయత్నించాడని తెలిపాడు. ఈలోగా మీరు రావడాన్ని చూసి ఇంట్లోకి వెళ్లి దాక్కున్నట్లు దొంగ వివరించాడు. కోపోద్రిక్తులైన గ్రామస్తులు, బాధితులు అతన్ని తాళ్లతో బంధించి, చెట్టుకు కట్టేసి కొట్టారు. పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే గ్రామానికి చేరుకొని, ఠాణాకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.



గ్రామస్తులు చెట్టుకు కట్టేసిన దొంగ

వివిధ కేసుల్లో ఎనిమిది మందికి జైలు

సిరిసిల్ల కల్చరల్: రాజన్నసిరిసిల్ల జిల్లాలో వివిధ కేసుల్లో ఎనిమిది మంది నేరస్తులకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తులు తీర్పు వెల్లడించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాల ప్రకారం.. సిరిసిల్ల సుందరయ్య నగర్‌కు చెందిన ఆడెపు రాజు స్థానికంగా సెల్ పాయింట్ నిర్వహిస్తున్నాడు. పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి, విక్రయిస్తున్నాడు. 2017లో అప్పటి ఎస్సై లియాకత్ అలీ కానిస్టేబుల్ రాకేశ్‌ను కస్టమర్‌గా పంపించారు. ఆయన రాజు వద్దకు వెళ్లి, రూ.100 ఇవ్వడంతో మెమొరీ కార్డులో పోర్న్ వీడియోలు నింపి, ఇచ్చాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఐదుగురు సాక్షులను శుక్రవారం సిరిసిల్ల కోర్టులో ప్రవేశపెట్టగా రాజుకు ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ రెండేళ్ల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు.

హత్యాయత్నం కేసుల్లో ఏడుగురికి..

హత్యాయత్నం కేసుల్లో ఇరువర్గాలకు చెందిన ఏడుగురికి ఏడాది జైలుశిక్ష పడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పవన్ వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన రావుల వెంకటేశ్, కొండయ్య, నర్సయ్య, మర్రి తిరుపతిలకు రావుల బాలకృష్ణ, దేవా, రఘులతో భూ తగాదాలున్నాయి. 2022 జనవరిలో పొలంలో కూర్చొని ఉన్న వెంకటేశ్‌పై బాలకిషన్, దేవా, రఘు గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్ వర్గీయుల దాడిలో బాలకిషన్ గాయపడ్డాడు. రావుల కొండయ్య ఫిర్యాదు మేరకు బాలకిషన్, దేవా, రఘులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాలకిషన్ ఫిర్యాదు మేరకు వెంకటేశ్, కొండయ్య, నర్సయ్య, తిరుపతిలపై కేసు నమోదైంది. అప్పటి ఎస్సై విజయ్‌కుమార్ నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కోర్టులో 9 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువవడంతో న్యాయమూర్తి రాధికా జైస్వాల్ ఒక్కొక్కరికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.

‘మేం పోలీసులం.. నిన్ను చెక్ చేయాలి’

- గంజాయి పేరిట వృద్ధుడి బంగారు చైన్, ఉంగరం అపహరణ

కోరుట్ల: ‘మేం పోలీసులం.. నీ దగ్గర గంజాయి ఉందని సమాచారం ఉంది.. నిన్ను చెక్ చేయాలని’ ఓ వృద్ధుడిని ఇద్దరు యువకులు బెదిరించారు. అతని వద్ద నుంచి బంగారు చైన్, ఉంగరం అపహరించిన సంఘటన కోరుట్లలో చోటుచేసుకుంది. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని దేశాయ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి భూమరాజం(65) శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో కూరగాయలు కొనుగోలు చేసి, ఇంటికి వెళ్తున్నాడు. ఇందిరా రోడ్‌లో ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి అతన్ని ఆపారు. తాము పోలీసులమని, నీ వద్ద గంజాయి ఉందని తెలిసిందని, చెక్ చేయాలన్నారు. ఆ తర్వాత నీ వద్ద ఉన్న బంగారు చైన్, ఉంగరం దొంగవి అని అనుమానంగా ఉందని చెప్పి, వాటిని తీసుకున్నారు. ఆ తర్వాత అక్కడినుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుల సీసీ ఫుటేజీ దృశ్యాలు విడుదల చేశామని, వారి కోసం వెతుకుతున్నట్లు పేర్కొన్నారు.



బైక్‌పై వెళ్తున్న నిందితులు

ఖాతా నుంచి రూ.4.9 లక్షలు మాయం

మానకొండూర్ రూరల్: ఇన్‌స్టాగామ్ లింక్ ఓపెన్ చేసిన ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి రూ.4.92 లక్షలు మాయమయ్యాయి. సీఐ సదన్‌కుమార్ వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని ఊటూర్‌కు చెందిన నెమ్మది ప్రశాంత్‌కు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఇన్‌స్టాగామ్‌లో లింకు వచ్చింది. ఓపెన్ చేయగానే అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ.4.92 లక్షలు పోయాయి. రాత్రి బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉండే పేరం మనోజ్‌కుమార్(30) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లక్ష్మణ్‌రావు వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా బిట్రగుంటకు చెందిన మనోజ్‌కుమార్ ఉపాధి నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి శాంతినగర్‌లో ఉంటున్నాడు. అతనికి అప్పులుండటంతో నిత్యం బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై, శుక్రవారం ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య ఉంది.

యువకుడి ఆత్మహత్య

కథలాపూర్(వేములవాడ): కలికోట గిరిజన తండాకు చెందిన ధరావత్ చరణ్(18) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. చరణ్ ఇంటర్మీడియట్ మధ్యలోనే మానేశా డు. తమ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా చేసి, వృథాగా ఖర్చు చేస్తున్నాడని అతని తల్లిదండ్రులు గుర్తించారు. ఎందుకు ఇలా చేస్తున్నావంటూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన చరణ్ గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి పోయి, గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం గ్రామస్తులు అతని మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి తండ్రి బాబు రెడ్డి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



చరణ్ (ఫైల్)

‘రూ.25 వేలిస్తే గంజాయి కేసు మాఫీ చేస్తాం’

- ముత్యంపేటవాసికి ఫేక్ కాల్

మల్యాల(చొప్పదండి): ‘మీ కొడుకు కెనడాలో గంజాయి కేసులో పట్టుబడ్డాడు.. రూ.25 వేలిస్తే కేసు మాఫీ చేస్తాం’ అంటూ ఓ వ్యక్తికి ఫేక్ కాల్ వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన రవి కుమారుడు కెనడాలో ఉన్నాడు. శుక్రవారం ఓ వ్యక్తి రవికి ఫోన్ చేసి, రూ.25 వేలిస్తే మీ కొడుకుపై ఉన్న గంజాయి కేసు మాఫీ చేస్తామన్నాడు. అనుమానం వచ్చిన అతను తన వద్ద రూ.5 వేలు ఉన్నాయని, కాసేపు ఆగి, పంపిస్తానని ఫోన్ కట్ చేశాడు. తర్వాత తన కుమారుడికి ఫోన్ చేయగా తాను సురక్షితంగా ఉన్నానని చెప్పడంతో ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నాడు. దీనిపై సీఐ రవిని సంప్రదించగా ఈ మధ్య ఫేక్ కాల్స్ చాలా వస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికీ ఓటీపీ చెప్పవద్దని, డబ్బులు పంపవద్దని సూచించారు.

గంజాయి ఉంటే పట్టేస్తాయి..

- పోలీసు జాగిలాలతో గంజాయి వేట

తిమ్మాపూర్(మానకొండూర్): గంజాయిని నిరోధించడానికి నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన జాగిలాలతో కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. తిమ్మాపూర్ మండలంలోని అలుగునూర్, ఎల్ఎండీ పరిధిలోని బస్టాండ్, పాన్ షాప్‌లు, కిరాణాషాపుల్లో తనిఖీలు చేశామని సీఐ స్వామి తెలిపారు. గంజాయిని రవాణా చేసే వ్యక్తులను సీపీ అభిషేక్ మహంతి ఆదేశాలతో పోలీస్ జాగిలాల ద్వారా పట్టుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై చేరాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ జాగిలాలతో తనిఖీ చేస్తున్న సీఐ స్వామి

వరకట్న వేధింపుల కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): వరకట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన శ్రావ్యను అదే గ్రామానికి చెందిన ఎర్ర అశోక్ నాలుగేళ్ల క్రితం ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక పాప ఉంది. ఈ క్రమంలో కొంతకాలంగా రూ.4 లక్షల కట్నం తీసుకురావాలని భర్త అశోక్, అత్త రాజేశ్వరి, మామ సారయ్య ఆమెను వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పాఠాలు చెప్పే టైంలో ఫంక్షన్‌లో..

- ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకం

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన సమయంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు శుభకార్యానికి హాజరుకావడం చర్చనీయాంశమైంది. కొందరు టీచర్లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. వివరాలు.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్ది ప్రభుత్వ పాఠశాలలో గాదె నర్సింగరావు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఉదయం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం 1.30 గంటలకు పట్టణంలో ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. అక్కడ సుమారు 45 నిమిషాలు గడిపాడు. ఇది గమనించిన ‘సాక్షి’ 3 గంటల సమయంలో పాఠశాలకు వెళ్లి చూడగా, ఆఫీస్ రూంలో కనిపించాడు. నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 12.10 గంటల నుంచి 1.10 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుంది. తర్వాత సాయంత్రం 4గంటల వరకు తరగతులు ఉంటాయి. నర్సింగరావు తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో తీరిగ్గా శుభకార్యానికి వెళ్లి, తిరిగి విధులకు హాజరు కావడంపై అక్కడే ఉన్న ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌ను వివరణ కోరగా, ఎంఈవో పర్మిషన్ తీసుకొని వెళ్లాడని బదులిచ్చారు. ఇదే విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లగా తాను లంచ్ బ్రేక్‌లో మాత్రమే వెళ్లి రావాలని సూచించానన్నారు. అంతేగానీ, తరగతులు నడిచే సమయంలో వెళ్లాలని చెప్పలేదని పేర్కొనడం గమనార్హం.



వేడుకలో పాల్గొన్న ఉపాధ్యాయుడు(వృత్తంలో)

ముష్టిపల్లివాసిని స్వగ్రామం పంపండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- సౌదీ అరేబియాలోని ఎంబసీకి లేఖ

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పరిధిలోని ముష్టిపల్లికి చెందిన చీమల మహేశ్‌ను స్వగ్రామం పంపించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సౌదీ అరేబియాలోని ఎంబసీకి శుక్రవారం ఆయన లేఖ రాశారు. వివరాల్లోకి వెళ్తే.. మహేశ్‌కు భార్య సంతోషి(30), ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అతను బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితమే సౌదీ వెళ్లి, అక్కడి ఓ కంపెనీ పనిలో చేరాడు. ఈ క్రమంలో గ్రామంలో గురువారం వ్యవసాయ పనులు ముగించుకొని, ఇంటికి వస్తున్న సంతోషి ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతిచెందింది. మహేశ్ భార్య చనిపోయిందని, అతను త్వరగా ఇంటికి వచ్చేలా చూడాలని కోరుతూ బంధువులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిశారు. స్పందించిన ఆయన మహేశ్‌ను త్వరగా స్వదేశానికి పంపించాలంటూ సౌదీలోని ఎంబసీకి లేఖ రాసి, అక్కడి అధికారులతో మాట్లాడారు. వారు ఈరోజే(శుక్రవారం) ఇండియాకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల సందడి



ఆలయంలో భక్తులు



అమ్మవారికి ఒడి బియ్యం..

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో శుక్రవారం శ్రావణ సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రొటోకాల్ కార్యాలయంలో వీఐపీలకు బ్రేక్ దర్శనాల టికెట్లు అందించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

రాజన్న ఆలయంలోని శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, మహాలక్ష్మి హోమం జరిపారు. రేవతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వారికి ఉదయం అభిషేకం, సాయంత్రం సదస్యం నిర్వహించారు.

‘చంద్రయాన్‌తో అగ్రదేశాల సరసన భారత్’

కరీంనగర్: చంద్రయాన్ ప్రయోగంతో భారత్ అగ్రదేశాల సరసన నిలిచిందని రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం, ఇస్రో చేపట్టిన చంద్రయాన్ ప్రయోగం విజయవంతమవడం మన దేశానికి గర్వకారణమన్నారు. అంతరిక్ష ప్రయోగాలు సక్సెస్ అవుతుండడం దేశ అభివృద్ధికి చిహ్నమని తెలిపారు. రాకెట్ ప్రయోగాలకు రాకెట్లను సైకిళ్లపై తీసుకెళ్లిన స్థాయి నుంచి నేడు రోదసీలో మన దేశ జెండాను నిలిపే స్థాయికి ఎదిగిన ఘన చరిత్ర ఇస్రోదని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ

పాలకుర్తి(రామగుండం): మండలంలోని బామ్లానాయక్ తండాలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. బామ్లానాయక్ తండా గ్రామానికి చెందిన ఇస్లావత్ బుజ్జి శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి, వ్యవసాయ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లగా బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన అరతులం బంగారం, 25 తులాల వెండి కనిపించలేదు. దీంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుంది. ఈ ఘటనపై బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

నెల వ్యవధిలో 3 ఘటనలు..

బామ్లానాయక్ తండాలో నెల రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరిగాయని తండావాసులు తెలిపారు. గ్రామంలో ఎన్టీపీసీ సీఎస్సార్ పథకం కింద ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలకు సంబంధించిన 10 బ్యాటరీలను 20 రోజుల క్రితం దుండగులు ఎత్తుకెళ్లారని అన్నారు. మూడు రోజుల క్రితం మరో బ్యాటరీ చోరీ చేశారని పేర్కొన్నారు. వరుస ఘటనలతో భయంభయంగా గడుపుతున్నామని, పోలీసులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చిందరవందరగా వస్తువులు

ఇసుక అక్రమ రవాణాపై కొరడా

- 21 ట్రాక్టర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు
- కేసు నమోదు

కోరుట్ల: ఇసుక అక్రమ రవాణాపై కోరుట్ల రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. రెండు రోజుల వ్యవధిలో కోరుట్ల పట్టణంలో 21 ట్రాక్టర్లను పట్టుకున్నారు. వీటిలో రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. మిగతా 19 ట్రాక్టర్లు ఇదివరకు ఎన్నిసార్లు పట్టుబడ్డాయి.. వాటికి ఫిట్‌నెస్ పత్రాలు, డ్రైవర్లకు లైసెన్స్ ఉన్నాయా.. లేదా పరిశీలించి, తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిసింది. ఓవైపు అధికారులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటుండగా కథలాపూర్ మండలంలోని తక్కళ్లపల్లి, నాగులపేట ప్రాంతాల నుంచి అర్ధరాత్రి టిప్పర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం.



తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్లు

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): హుజూరాబాద్ మండలంలోని సిర్సపల్లికి చెందిన దొంత మైసయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి వి.వెంకటేశ్ తీర్పు చెప్పారని విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.షాదుల్లా బాబా తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... మైసయ్య తన ఇంటికి అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తూ అధికారులు పట్టుబడ్డాడు. వారు విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేసి, మొదటి నేరం కింద రూ.500 జరిమానా విధించి, వదిలేశారు. మైసయ్య మరోసారి విద్యుత్ వినియోగిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువవడంతో మైసయ్య రూ.2,817 జరిమానా చెల్లించాలని లేదంటే ఒక నెల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పు వెల్లడించారు.